

## శాసన మండలి ఎన్నికల దృష్ట్యా 'స్పందన' రద్దు కలెక్టర్

**తిరుపతి సిటి :** ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి ఎన్నికలు జరగనున్న దృష్ట్యా మార్చి 21 వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'స్పందన' కార్యక్రమం ఈనెల 20, 27, మార్చి 6, 13, 20 తేదీల్లో రద్దు చేసినట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి మార్చి 27న సోమవారం నుంచి యధావిధిగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసే ప్రజలు గమనించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## తారకరత్న అంత్యక్రియలకు వెళ్లనున్న నారా లోకేష్

**ప్రజాశక్తి - శ్రీకాళహస్తి**

**యువగళం పాదయాత్రకు 'స్వల్ప విరామం'**



ప్రముఖ హీరో నందమూరి తారకరత్న మృతి కారణంగా యువగళం పాదయాత్రకు నారా లోకేష్ స్వల్ప విరామం ప్రకటించారు. తారకరత్న అంత్యక్రియలకు వెళ్లి వచ్చిన తర్వాత పాదయాత్రను తిరిగి కొనసాగించనున్నారు. తారకరత్న గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గుండెపోటు కారణంగా బెంగళూరులోని నారాయణ హృదయాలయలో చికిత్స పొందు తున్నారు. దాదాపు 23 రోజులుగా అక్కడే ఆయనకు వైద్యం అందుతోంది. కార్డియాక్ అరెస్ట్ తీవ్రత కారణంగా తారకరత్న శరీరంలోని పలు అవయవాలు పని చేయకుండా పోయాయి. మెదడు సైతం తీవ్రంగా దెబ్బతింది. ఈ నేపథ్యంలోనే విదేశీ వైద్యుల బందం ఈ రంగంలోకి దిగింది. ఆయనకు ప్రత్యేక వైద్యం అందిస్తోంది. ఎప్పటికప్పుడు ఆయన ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తోంది. అయితే శనివారం ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. అత్యంత విషమంగా మారింది. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తారకరత్న ఎన్టీఆర్ వారసుడిగా సినిమాల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. 'ఒకటో నెంబర్ కుర్రాడు'తో ఓ మంచి విజయాన్ని సొంతం చేసుకున్నారు. 2002లో తన కెరీర్ను ప్రారంభించిన ఆయన ఇప్పటివరకు దాదాపుగా 23 సినిమాల్లో నటించారు. అమరావతి సినిమాలో తన నట విశ్వరూపాన్ని చూపించారు. సైకో పాత్రలో అద్భుతంగా నటించారు. అమరావతి సినిమాలో ఆయన నటనకు గాను నంది అవార్డును సొంతం చేసుకున్నారు. విజయసాయిరెడ్డి భార్య చెల్లెలి కూతుర్ని ప్రేమించి మరీ పెళ్లి చేసుకున్నారు. అయితే, మధ్యలో కొన్నేళ్ల పాటు సినిమాలకు దూరం అయ్యారు. 2022లో '9 అవర్స్' అనే ఓ వెబ్ సిరీస్తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ వెబ్ సిరీస్కు మంచి రెస్పాన్స్ వచ్చింది. నందమూరి బాలయ్యతోపాటు కుటుంబ సభ్యులందరూ బెంగళూరుకు చేరుకున్నారు.

# భక్తులతో శ్రీకాళహస్తి కిటకిట



**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**

మహాశివరాత్రి సందర్భంగా శ్రీకాళహస్తి క్షేత్రం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయంలో పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వేకువజాము రెండున్నర గంటల నుంచి దర్శనం మొదలైంది. అప్పటి నుంచే భక్తులు ఆలయానికి రావడం ప్రారం భించారు. హరహర మహాదేవ శంభోశంకర అని ఆదిదేవుని స్మరిస్తూ చలిలో కూడా భక్తులు స్వర్ణముఖి నదిలో స్నానాలు చేసి ఆలయానికి వచ్చారు. అదనపు క్యూలు, ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేయడంతో భక్తులు పెద్దగా ఇబ్బందులు పడలేదు. ఈ ఏడాది ఆలయంలో ఏర్పాటు చేసిన పూలు, పండ్ల డెకరేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సారీ ఆలయంలో పోలీసుల హవా కొనసాగింది. భక్తులకు బదులు వీఐపీ దర్శనాలకే వారు ప్రాధాన్యతనిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మాధుసూదన్ రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో సాగర్ బాబు శివరాత్రి మహెూత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



## రక్షణ కల్పించాలని ప్రేమజంట వినతి

**చిత్తూరుఅర్బన్:** 'ప్రేమ వివాహం చేసుకున్నాం... రక్షణ కల్పించండి' అంటూ ఓ ప్రేమ జంట ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే చిత్తూరు నగరంలోని ప్రెస్ క్లబ్లో శనివారం గుర్రప్ప నాయుడు వీధికి చెందిన జాహ్నవి, ముత్తు మారి యమన్ కోవిల్ వీధికి చెందిన భానుచందర్ అనే ప్రేమ జంట తాము ప్రేమ వివాహం చేసుకున్నామని, పెద్దల నుండి ప్రాణహాని ఉందని, తమకు న్యాయం కల్పించాలని కోరారు. గతంలో తమ పెద్దలు ఇద్దరినీ రకరకాలుగా హింసించే వారని, భానుచందర్ అతని స్నేహితుల పై కూడా దౌర్జన్యానికి పాల్పడ్డారని తెలిపారు. మేజర్ కావడంతో ప్రస్తుతం పెళ్లి చేసుకున్నామని, పెద్దల నుండి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

## నేడు జెడ్పి సర్వసభ్య సమావేశం

**చిత్తూరుఅర్బన్:** ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ సమావేశపు మందిరంలో జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్య క్షతన జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమా వేశం జరగనుంది. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుమతి మేరకు ఎన్నికల ప్రవర్తనానియమావళికి లోబడి జరగనుంది. ప్రధానంగా రానున్న వేసవిని దష్టిలో ఉంచుకొని తాగు నీటి ఎద్దడి నివారణకు తీసు కోవలసిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు జడ్పీ సి ఈ ఓ ప్రభాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటన లో తెలిపారు.

## 'పార్టీకి షణ్ముగం రాజీనామా'

**చిత్తూరుఅర్బన్:** బీసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి నుండీ షణ్ముగంను తొలగిస్తున్నట్లు తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడు శుక్రవారం ప్రకటించారు. అయితే తాను పార్టీ క్రియాశీలక సభత్వానికి రాజీనామా చేస్తున్నట్లు శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి బీసి నాయకులు షణ్ముగం తెలిపారు. కొందరు జిల్లా నేతల అనుచిత ప్రవర్తన వల్ల పార్టీకి బిసి నేతలు దూరం అవుతున్నట్లు చెప్పారు. చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షులు పులివర్తి నాని ప్రవర్తన వల్ల గతంలో నగర అధ్యక్షులు మాపాక్షి మోహన్‌ను, తనను పార్టీ దూరం చేసుకుందన్నారు. చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో 37 డివిజన్లు ఏకగ్రీవం కావడం పట్ల ముఖ్య నేతలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. పార్లమెంటరీ అధ్యక్షులు, ఎంఎల్‌సి, మాజి జెడ్పి చైర్మెన్ కాపురం ఉండే డివిజన్ ఏకగ్రీవం కావడంపట్ల ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. బీసిల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు.



## త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తవ్వాలి : కమిషనర్

**చిత్తూరుఅర్బన్ :** జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయించాలని నగర కమిషనర్ అరుణ హౌసింగ్, అమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం ఉదయం కమిషనర్ నగరపాలక పరిధిలోని తేనెబండ హౌసింగ్ లేఔట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా లేఔట్ లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హౌసింగ్, సూపర్వైజర్ అధికారులు, అమినిటీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. వారాంతపు లక్ష్యాలు పూర్తి చేయడం ద్వారా ఉగాది నాటికి అనుకున్న మేర ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి.. ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలన్నారు. వివిధ దశలో సాగుతున్న నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ స్టేజ్ కన్వర్షన్లు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీధర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహా, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అంబేద్కరా...రాజ్యాంగాన్ని కాపాడు

**ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్**

**కళ్లకు గంతలతో టిడిపి నిరసన**

యువగళం పాదయాత్ర, రాష్ట్రానికి ఇదే ఖర్మ యాత్రలను అధికారపార్టీ, పోలీసులు అడ్డుకోవడాన్ని నిరశిస్తూ 'రాజ్యాగాన్ని అంబేద్కరా నీవే కాపాడు' అంటూ తెలుగుదేశం నేతలు శనివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట కళ్లకుగంతలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి దొరబాబు, నగర అధ్యక్షురాలు కఠారి హేమలత మాట్లాడుతూ వైకాపా అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రాజ్యాంగం అమలు కావడం లేదన్నారు. రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న జగన్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. లోకేష్, చంద్రబాబు యాత్రలను పోలీసుల ద్వారా అడ్డుకోవాలని చూస్తున్నారని, రాజ్యాగం పట్ల అధికార పార్టీకి గౌరవం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. చంద్రబాబు, లోకేష్ యాత్రలతో అధికారపార్టీకి వణుకుపుడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాజూరు బాలాజి, కార్పొరేటర్ అశోక్ పాల్గొన్నారు.




కళ్లకు గంతలతో నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు

## నేడు యూపీఎస్సీ ఇంజనీరింగ్ సర్వీసెస్ ప్రిలిమ్స్ : ఆర్డీవో

**ప్రజాశక్తి - తిరుపతి సిటి**

ఈనెల 19న ఆదివారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ 2023 ప్రిలిమ్స్ పరీక్షలు జిల్లాలో రెండు కేంద్రాలలో నిర్వహించనున్నట్లు తిరుపతి రెవిన్యూ డివిజనల్ అధికారి కనక నరసారెడ్డి అన్నారు. శనివారం ఉదయం స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వింగ్ ఏ , బి రెండు కేంద్రాలలో నిర్వహించనున్నామని, 822 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్ష సమయానికి 10 నిముషాల ముందే ప్రధాన గేట్లు మూసివేస్తారని, అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. ఈ సమీక్షలో తహశీల్దార్లు దస్తగిరి , హనుమాన్ నాయక్ , పరీక్ష కేంద్రాల సూపర్వైజర్లు ఎస్ వి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ నారాయణమ్మ, ప్రొఫెసర్ సుబ్రమణ్యం, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై చంద్రశేఖర్, విద్యుత్ శాఖ ఏఈ శంకర్ రెడ్డి, డిటి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## అనపర్తిలో పోలీసులపై చర్య తీసుకోవాలి : సిపిఎం

**ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్**

చంద్రబాబు పర్యటన సందర్భంగా తూర్పుగోదావరి జిల్లాలో రెండో రోజు పర్యటనలో అనపర్తి వద్ద యాత్రను అడ్డగించి ముందుకు పోకుండా ఆటంకపరిచిన పోలీసులపై చర్య తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సభకు ముందస్తు అనుమతి ఇచ్చినా పోలీసులు చట్ట విరుద్ధంగా రోడ్డుపై బైఠాయించి, ట్రాఫిక్‌ని ఆటంకపరచడం చట్ట విరోధమని, చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే చట్ట విరుద్ధంగా వ్యవహరించడం నేరమన్నారు. రాజకీయ కక్షతోనే ఇది చేసినట్లుగా ప్రజలకు అర్థమవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి తుంటరి పనులు మానుకొని ప్రజాస్వామ్య బద్ధంగా అన్ని రాజకీయ పార్టీలు స్వేచ్ఛగా సభలు జరుపుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరారు.

## చిత్తూరు అభివృద్ధిపై చర్చించాలి

**చిత్తూరుఅర్బన్:** జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చిత్తూరు అభివృద్ధిపై చర్చించాలని స్మార్ట్‌సిటి డెవలప్‌మెంట్ నాయకులు తాండవమూర్తి, జయచంద్రచౌదరి, మురళిలు కోరారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పేరుకే జిల్లా కేంద్రంగా చిత్తూరు మిగిలిపోయిందని, అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఉన్న ఫ్యాక్టరీలు మూతపడడంతో నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక అల్లాడుతున్నారని, ప్రజల అవసరాలకు తగ్గటుగా తాగునీరు అందించడం పాటు యునివర్శిటి ఏర్పాటు చేయాలన్నారు. హైరోడ్డు విస్తరణ చేపట్టాలని, జిల్లా కేంద్రమైన చిత్తూరు అభివృద్ధిపై మూడు నెలలకో సారి నిర్వహించే జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో చర్చించాలని కోరారు.

## శ్రీసిటీలో సాయికృష్ణ యాచేంద్ర 'సంగీత గేయధార'

**ప్రజాశక్తి - వరదయ్యపాలెం**

ప్రముఖ పండితులు, గాయకులు, విఖ్యాత వెంకటగిరి వెలుగోటి రాజ వంశీకులు, శ్రీ వెంకటేశ్వర భక్తి చానెల్ (ఎస్వీబిసి) చైర్మన్ డా. వెలుగోటి భాస్కర సాయికష్ణ యాచేంద్ర 'సంగీత గేయధార' కార్యక్రమం, శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహితీ వేదిక శ్రీవాణి ఆద్వర్యంలో శనివారం శ్రీసిటీలో జరిగింది. ఇది సాయికష్ణ యాచేంద్ర నిర్వహించిన 403వ గేయధార. డా. యాచేంద్రకు, ప్రుచ్ఛకులకు, కార్యక్రమానికి విచ్చేసిన అతిధులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. కార్యక్రమానికి సమన్వయ కర్తగా కందనూరు మధు వ్యవహరించగా, ప్రుచ్ఛకులుగా పాల్గొన్న శోభా రాజా, కుసుమ కుమారి, పణతుల సుబ్రమణ్యం, జేకే రెడ్డి, వెంకట రామజోగి, కామేశ్వర రావులను శ్రీసిటీ ప్రతినిధి పల్లేటి బాలాజీ సభకు పరిచయం చేశారు. సంగీత సాహిత్య ప్రధానంగా సాగిన ఈ కార్యక్రమం అష్టావధానం లాంటి ప్రక్రియ. పచ్ఛకులు సూచనలకు అనుగుణంగా గేయ అవధాని డా. యాచేంద్ర అప్పటికప్పుడే ఆశువుగా రాగతాళ యుక్తంగా గేయాలను ఆలపించారు. శ్రీసిటీ సష్ఠి కర్త రవీంద్ర సన్నారెడ్డి సాధించిన విజయాన్ని మెచ్చుకుంటూ, ఆయన తండ్రి ఇచ్చే అశీస్సులను గేయ రూపంలో గానం చేయమని, 'మానవుడే మహనీయుడు' అన్న పల్లవిని వెంకట రామజోగి సూచించారు. వేలమందికి ఉపాధిని కల్పిస్తూ ఆధునిక దేవాలయంగా పిలువబడుతున్న శ్రీసిటీని కీర్తిస్తూ ఒక మనోహర గేయాన్ని ఆలపించారు. ఛివర్లో తరిగొండ వెంగమాంబ రచించిన లాలిపాటను పాడారు. భావసౌందర్యం, గానమాధుర్యం జట్టు కడుతూ, సంగీత సాహిత్యాలు చెట్టా పట్టాలు వేసుకుంటూ మనోహరంగా సాగిన 'సంగీత గేయధార', రసజ్ఞులను, సాహితీ ప్రియులను ఎంతగానో మెప్పించింది.



## హీరో మోటోకార్స్ హైటెక్ 110సిసి విడుదల

**ప్రజాశక్తి-తిరుపతి సిటి**




హీరో మోటోకార్ప్ నూతనంగా తయారు చేసిన హైటెక్ 110సిసి-ఎక్స్ఓఓఎం స్కూటర్‌ను శనివారం మార్కెట్లో విడుదల చేశారు. తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో చీఫ్ గ్రోత్ ఆఫీసర్ రంజివ్‌జిత్ సింగ్ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా హీరో మోటోకార్ప్ దేశాన్ని అకట్టుకున్న ఐ కానిక్ బ్రాండ్‌లను పరిచయం చేసిందన్నారు. హీరోక్సూమ్ శైలీ, పనితీరుతో స్కూటర్ సెగ్మెంట్‌ని పునర్నిరించడానికి తమ ప్రయాణంలో కొత్త మలుపు తీసుకుంటున్నామని తెలిపారు. కొత్త హీరో అనేది దేశ అవసరాలపై లోతైన అవగాహన, పోర్టిఫోలియోను బలోపేతం చేయడంలో ఉత్తేజకరమైన గైడ్ కోసం ఆవిష్కరణలో ముందంజలో ఉన్నామన్నారు. షీట్ డ్రమ్, కాస్ట్ డ్రమ్, కాస్ట్ డిస్క్ అనే మూడు వేరియంట్‌లలో కొత్త ద్విచక్రవాహనాన్ని ప్రవేశపెట్టామన్నారు. హీరో మోటోకార్ప్ డీలర్‌షిప్‌ల వద్ద రూ.73,349 ఎల్ఎక్స్-షీట్‌డ్రమ్, రూ.76,499 విఎక్స్-కాస్ట్‌డ్రమ్, రూ.81,399కి జడ్ఎక్స్-కాస్ట్‌డ్రమ్ లభిస్తాయన్నారు. ఇది తొలిసారిగా వినియోగదారులకు మెరుగైన భద్రతను అందిస్తుందన్నారు. రైడర్ టర్న్ తీసుకున్నప్పుడు, మలుపుల్లోకి వెళ్లినప్పుడు కార్నర్ బెండింగ్ లైట్స్ చీకటి మూలలో ఉన్న ప్రాంతాలను ఎదురులేని ప్రకాశవంతమైన, సృష్టమైన కాంతితో ప్రకాశింపజేస్తుందన్నారు. రైడర్ రాత్రి పూట సురక్షితమైన రైడింగ్‌ను చేసేలా నిర్ధారిస్తుందన్నారు. ఇది బిఎస్-6 కంప్లైట్ ఇంజిన్‌తో వస్తుంది. ఇందులో హీరో మోటోకార్ప్ శక్తివంతమైన ఐ3ఎస్ టెక్నాలజీ ఉందన్నారు. బ్లూటూత్ కనెక్టివిటితో కూడిన కొత్త డిజిటల్ స్పీడోమీటర్, సైడ్ స్టాండ్ ఇంజిన్-కట్-ఆప్ స్మూర్ టెక్ ప్రొపైల్‌కు జోడిస్తుందని తెలిపారు. దీన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఇక సికింద్రాబాద్‌కు 7 గంటలే ప్రయాణం

**ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో**

**త్వరలోనే తిరుపతికి 'వందేభారత్' రైలు**

వందేభారత్ రైలు... త్వరలోనే తిరుపతి - సికింద్రాబాద్ మధ్య పట్టాలెక్కనుంది.. ఈ ట్రైన్ టికెట్ ధర జిఎస్‌టి, తత్కాల్ సర్‌ఛార్జితో కలిపి రూ.1150 నుంచి స్టార్ట్ అవనుంది. టికెట్ ఛార్జీ, రైలు నంబర్లు ఫైనల్ కాగానే ఐఆర్‌సిటిసి వెబ్‌సైట్‌లో వివరాలను అప్‌లోడ్ చేస్తారు. ప్రస్తుతం తిరుపతి - సికింద్రాబాద్ మధ్య నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ ప్రయాణ సమయం 12 గంటలు పడుతుండగా, వందేభారత్ రైలు ప్రయాణం ఆరున్నర నుంచి ఏడు గంటలు పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ నెలాఖరులోపే ఈ ట్రైన్ అందుబాటులోకి రానుందని అధికారులు తెలిపారు. ఈ ట్రైన్ పక్కాగా డబ్బున్నోళ్లదే.. ఆ ట్రైన్ వస్తుంటే దాని పక్కన నిలబడటానికీ టికెట్ ధర విని సామాన్యుడు వణికిపోయే పరిస్థితి. నేలమీది విమానంగా ఈ ట్రైన్‌ను చెప్పవచ్చు.

ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో సికింద్రాబాద్ - విశాఖ మధ్య వందే భారత్ ట్రైన్ పరుగులు తీస్తోంది. ఈ సర్వీసు అందుబాటులోకి వచ్చాక సికింద్రాబాద్ నుంచి విశాఖకు వెళ్లే వాళ్లకు ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది. ఈ ట్రైన్‌లో కేవలం 8 గంటల 40 నిమిషాల్లోనే విశాఖకు చేరుకుంటారు. ప్రస్తుతం తిరుపతి - సికింద్రాబాద్ మధ్య త్వరలోనే ట్రాక్‌పైకి రానుంది. రూట్‌మ్యాప్‌పై కసరత్తు జరుగుతోంది. మొత్తం మూడు ఆప్షన్లు పరిశీలనలో ఉన్నాయి. ఒకటి బీబీనగర్, నడికుడి, మిర్యాలగూడ మీదుగా, ఇంకొకటి వరంగల్, ఖాజీపేట, కడప మీదుగా, మరొకటి బీబీనగర్ నుంచి గుంటూరు, నెల్లూరు, గూడూరు... ఇలా మూడు మార్గాలపై అన్వేషణ సాగుతోంది. అలానే పిడుగురాళ్ల జంక్షన్ నుంచి శావల్యపురం మీదుగా ఒంగోలు, సింగరాయకొండ, కావలి, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట మార్గంపై అధికారులు సమాలోచనలు చేశారు. వీటన్నింటిపై కూలంకుషంగా చర్చించి తక్కువ డిస్టెన్స్ ఉన్న మార్గాన్ని ఫైనలైజ్ చేయనున్నారు. గంటకు 130 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లేలా ట్రాక్‌ల సమర్థత, బ్రిడ్జి నిర్మాణ తనిఖీ అనంతరం అధికారికంగా ప్రకటించే అవకాశం రానుంది.



## జగన్ భజనలో ప్రతాప్ రెడ్డి : డాక్టర్ యం.ఉమేష్ రావు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి**



నరనరాన కుల అహంకారాన్ని జీర్ణించుకుని అధికార దర్పంతో పేట్రేగిపోతున్న యస్సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి జగన్ భజనలో లీనమైపోయి తన ఉద్యోగ ధర్మాన్ని పక్కన పెట్టేశాడని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి, బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు శనివారం ఆరోపించారు. రాష్ట్ర చరిత్రలో ఏ అధికారి చేయనంత అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ఊడిగం చేస్తున్న ప్రతాప్ రెడ్డికి ఉపాధ్యాయ వర్గాల సమస్యలు ఏ మాత్రం పట్టవని విమర్శించారు. కేవలం ఉపాధ్యాయ వర్గాలను భయపెట్టి, లొంగదీసుకొని, వైసిపి బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించడానికే ప్రతాప్ రెడ్డి కడపలో తిష్ట వేసి పాఠశాలల తనిఖీ పేరిట నాటకాలాడుతున్నాడని ఆరోపించారు. విద్యాశాఖను సీఎం జగన్ కు భజన కేంద్రంగా మార్చేసి, ఉపాధ్యాయ వర్గాన్ని నిట్టనిలువుగా ముంచుతున్న ప్రతాప్ రెడ్డి ఆగడాలకు చరమగీతం పాడేందుకు ఉద్యోగ ఉపాధ్యాయ వర్గాలు నడుం బిగించాలని ఉమేష్ పిలుపునిచ్చారు. ఎన్నికల నియమావళిని సైతం లెక్కచేయకుండా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి పైన కఠిన చర్యలు తీసుకొని, ఎన్నికలు ముగిసేవరకు రాష్ట్ర బహిష్కరణ విధించాలని ఎన్నికల కమిషన్ ను డిమాండ్ చేశారు.

## 'అధికార' అభ్యర్థులకు 'ఆర్‌జేడి'అండ...!

**ప్రజాశక్తి-తిరుపతి సిటి**

ప్రజా'దృష్టి'

తూర్పు, పశ్చిమ రాయలసీమ ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులకు విద్యాశాఖలోని కీలక అధికారి ఆర్‌జేడి అండగా నిలుస్తుండడం వైసిపి పాలనలో ప్రజాస్వామ్యం ఏవిధంగా పక్కదారి పడుతుందో అర్థమవుతోంది. సాధారణంగా శాసనమండలిలో మండలి సభ్యుల్లో మేధావులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులను ఎన్నుకోవడం సర్వసాధారణం. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో రద్దయిన శాసనమండలిని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పునరుద్ధరించారు. అప్పటి నుంచి శాసనమండలి ఉపాధ్యాయ, పట్టాభద్రుల ఎన్నికల్లో ఉపాధ్యాయ సంఘాలు, యువజన సంఘాల నాయకులు పోటీ పడి శాసనమండలికి వెళ్లేవారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా (గతంలో కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాలు)ఉపాధ్యాయ, పట్టాభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో అభ్యర్థులను బరిలోకి దింపిన దాఖలాలు లేవు. ఉన్నా నామ్‌కేవాస్తే...కానీ 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం శాసనమండలిలో తన బలాన్ని పెంచుకునేందుకు పథకం వేసింది. ఇతర పార్టీలకు చెందిన వారికి ఎరవేసి, తమ పార్టీలో చేరేలా చేసింది. రకరకాల ఎత్తుగడలు వేశారు. తాయిలాలకు, కేసులు, బెదిరింపులకు లొంగకుండా శాసనమండలిలో ప్రజలు, కార్మికుల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ఏకైక వ్యక్తులు పిడిఎఫ్ ఎంఎల్‌సిలు. ప్రతి సమావేశాల్లో నిర్దిష్టమైన సమాచారంతో ప్రభుత్వాన్ని నిలదీయడం వారికే సొంతం. దీంతో పిడిఎఫ్ ఎంఎల్‌సిలను ఎలాగైనా శాసనమండలిలోకి రానీయకుండా చూడాలని పథకం వేశారు. అనుకున్నదే తడువుగా తమ అభ్యర్థులను ప్రకటించి పోటీల్లోకి దింపారు. ఎలాగైనా ఆ స్థానాలను కైవసం చేసుకునేందుకు రకరకాల ఎత్తుగడులు వేస్తున్నారు. ఉపాధ్యాయులను, పట్టాభద్రులను లోబరుచుకునే పనిలో పడ్డారు. తాయిలాలు, గిఫ్ట్‌లు ఇస్తూ, బెదిరింపులకు దిగుతున్నారు. వీరికి ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు సైతం అండగా నిలుస్తుండడం గమనార్హం. అందులో భాగమే పశ్చిమ, తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎంఎల్‌సి ఎన్నికల్లో విద్యాశాఖలో కీలక పదవిలో ఉన్న ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డి ప్రలోభాల పాత్ర. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఇన్‌చార్జీ ఆర్‌జేడిగా విధులు నిర్వహిస్తున్న అధికారి అధికార పార్టీ ఎంఎల్‌సి అభ్యర్థులకు కొమ్ముకాస్తూ, ఉపాధ్యాయులను లోబరుచుకునే పనిలో పడ్డారు. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాలో ఉపాధ్యాయులను లాలింపులకు దిగారు, వారు మాట వినకపోయేసరికి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. తాజాగా ఉపాధ్యాయులకు గిఫ్ట్‌లు పంపిణీలో ఆయన పాత్ర బహిర్గితం కావడంతో ఆయనపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు, వామపక్షాలు డిమాండు చేస్తున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సైతం పది రోజుల క్రితం ఓ ప్రయివేట్ పాఠశాలలో జిల్లాకు చెందిన హెచ్‌ఎంలతో పదోవరగతి పరీక్షల సమీక్ష పేరుతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం అక్కడికి హాజరైన ఉపాధ్యాయులకు గిఫ్ట్‌బాక్సులను అధికార పార్టీ అభ్యర్థులు పంపిణీ చేశారు. వారిలో కొంత మంది ఉపాధ్యాయులు దాన్ని వ్యతిరేకించి వచ్చేశారు. అది బయటకు పొక్కడంతో తనకు ఏ మాత్రం సంబంధం లేదని, అది ప్రయివేట్ స్కూల్‌లో సమావేశం అని, తనకు తెలియదని ఆర్‌జెడి చెప్పడం కొస మెరుపు. ఆర్‌జేడి తన చర్యల వల్ల అధికార పార్టీ అభ్యర్థులకు వత్తాసు పలుకుతున్నారని మేధావులు, ఉపాధ్యాయులు, వామపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. ఎన్నికల కమిషనర్ సైతం విచారణకు ఆదేశించారు. అయితే ఈ విచారణ ప్రభావం సీరియస్‌గా ఉంటుందా.. మమా అనిపిస్తారా? అనేది వేచి చూడాల్సిందే.

## మునీశ్వరస్వామి సేవలో మంత్రి పెద్దిరెడ్డి



**ప్రజాశక్తి-సోమల:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని దుర్గం కొండపై వెలసిన గార్గేయ మునీశ్వర స్వామి ఆలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధీర్ రెడ్డి, మండలస్థాయి ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.
**అయ్యప్ప స్వామి సేవలో...**సదుం మండలం ఎర్రాతివారి పల్లె గ్రామంలో కోటమలై కొండపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం ఉదయం అర్చకుల వేదమంత్రాల నడుమ దర్శించుకున్నారు.

## 'విజయం' 14వ వార్షికోత్సవం




**ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:** స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో శనివారం విజయం జూనియర్ కళాశాల 14వ వార్షికోత్సవంలో విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి విజయం విద్యా సంస్థలు విద్యార్థుల అభ్యున్నతి కోసం తీసుకుంటున్న కార్యక్రమాలను వివరించారు. విలువలతో కూడిన విద్యను అందించడంతో పాటు విజయంలో విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను అలరించాయి. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అవార్డులు, ప్రసంశా పత్రాలు పంపిణీ చేశారు.

## పరిరక్షణ సమితి సభ్యత్వ నమోదు

**ప్రజాశక్తి-పలమనేరు:** గత ఆరు సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పలమనేరు ప్రజల మన్ననలు అందుకుంటున్న ప్రముఖ సేవా సంస్థ పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 18 నుండి 28వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు సుబ్రహ్మణ్యం పిళ్ళై, నరసింహులు తెలిపారు. స్థానిక ఎన్జీవో హోం నందు గల పిపిఎస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ సభ్యత్వం తీసుకోవడం ద్వారా, సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంస్థ సభ్యత్వాన్ని పొందడానికి ఆధార్ కార్డు, ఫోటో, మొబైల్ నెంబర్, రూ.500 వార్షిక సభ్యత్వ రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి కలిగిన పౌరులందరూ కార్యాలయాన్ని సంప్రదించి సభ్యత్వం పొందవచ్చునని పేర్కొన్నారు.

## ఎన్ఎస్ఎస్‌లో విద్యార్థుల సేవలు అభినందనీయం



**ప్రజాశక్తి-క్యాంపస్:** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్-ఎస్ బ్యూరో యూనిట్ 7-11 దత్త గ్రామాలైన కుంట్రపాకం, నాగూర్ కాలనీలో ప్రత్యేక శిబిరం ముగింపు సమావేశానికి సర్పంచ్ శుభ, పద్మనాభరెడ్డి , వల్లి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సర్పంచ్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసే తత్వాన్ని విద్యార్థులందరూ అలవర్చుకోవాలని.. గ్రామీణాభివృద్ధి లో కీలక భాగస్వాములు కాగలరన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో చురుకుగా పాల్గొన్న విద్యార్థి వాలంటీర్లను అభినందించి సర్టిఫికెట్లు అందించారు. పాఠశాలలో విద్యార్థులకు విజ్ఞాన ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డా.పి.మాధవి, డా.ఎం.పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆకలేస్తోంది .. ఆదుకోండయ్యా..!

- రెండు నెలలుగా అందని రేషన్ బియ్యం
- దీనబంధపురం పేదల ఆవేదన



**ప్రజాశక్తి-పాలసముద్రం:** మండలంలోని దీనబందపురం ఆదిఆంధ్రవాడ గ్రామస్తులు రెండు నెలలుగా ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులు మాకు సక్రమంగా అందలేదని శనివారం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 35 కుటుంబాలు జీవనం చేస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం నెలకి 350 కేజీలు వస్తుంది. రెండు నెలలుగా మా గ్రామానికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న బండి లేదు. రోజూ కూలికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న బియ్యంతో రాగి ముద్ద చేసుకుని జీవనం చేస్తున్నాం. రెండు నెలలుగా బియ్యం అందకపోవడంతో పిల్లలతో సహా ఆకలితో అలమటిస్తున్నాము. మేము రోజూ మా గ్రామానికి బియ్యం బండి ఎప్పుడు వస్తుందని ఫోన్ ద్వారా అడిగితే ఈరోజు, రేపు వస్తుందంటూ కాలం పోయి, తీరా 15వ తేదీ పైగా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ క్లోజ్ అయి పోయిందని తెలుపుతున్నారు. మా గ్రామానికి నిత్యావసర సరుకులు సక్రమంగా అందలేదని రెవెన్యూ సిబ్బందికి విన్న వించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మాకు రెండు నెలల నిత్యావసర సరుకులు అందేలా చూడాలని గ్రామస్తులు కోరారు.



**అయ్యా మేము వస్తున్నాం:** రోజూ కూలీలకు వెళ్లి జీవనం చేసుకుంటున్నాం, రెండు నెలలుగా మాకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులు సక్రమంగా అందకపోవడంతో మేము, మా పిల్లలు ఆకలితో అలమటిస్తున్నాం. **-జ్యోతి, ఆదిఆంధ్రవాడ గృహిణి,**



**వెబ్‌సైట్ క్లోజ్ అయింది:** రోజూ మా గ్రామానికి బియ్యం ఇవ్వడానికి ఎప్పుడు వస్తారని ఫోన్ ద్వారా అడిగితే ఈరోజు, రేపు వస్తాయని చెప్పి చివరికి వెబ్‌సైట్ క్లోజ్ అయిందని చేతులెత్తేశారు. **- శాంతమ్మ, ఆది ఆంధ్రవాడ గృహిణి.**



**రెండు నెలల బియ్యం మాకు అందించాలి:** ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత రేషన్ బియ్యం మాకు రెండు నెలలుగా అందలేదు. ఉన్నతాధికారులు స్పందించి మాకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని మాకు అందించాలి లేదంటే మేము పస్తులుండాలి. **- మురగయ్య, ఆది ఆంధ్ర వాడ నివాసి.**

## చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం సరికాదు



**ప్రజాశక్తి-వెదురుకుప్పం:** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని టీడీపీ జిల్లా మాజీ కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌ఛార్జి పి మోహన్ మురళి అన్నారు. వెదురుకుప్పం మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షులు లోకనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగింది. కార్యక్రమంలో మోహన మురళి మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం పోలీసులను తొత్తుగా ఉపయోగించు కుంటూ విపేక్షనేతలను అడ్డుకోవడం దారుణం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నరసింహయాదవ్, రాష్ట్ర సాంస్కృతిక విభాగ ప్రధాన కార్యదర్శి ముని చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
**కార్వేటినగరం:** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలో జాతీయ టీడీపీ అధ్యక్షులు చంద్రబాబు



నాయుడు పర్యటనను అడుగడుగునా అడ్డుకోవడం, కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి చేయడం దారుణమని టీడీపీ మండల అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్, కార్యదర్శి రాజేంద్రరెడ్డి అన్నారు. శనివారం గాండ్లమిట్ట కూడలి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎవరైనా సమావేశాలు పెట్టుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నాగేశ్వరరాజు, జీడి నెల్లూరు బీసీ సంఘం అధ్యక్షులు రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.
**పలమనేరు:** రాష్ట్రంలో రాజ్యాంగ మౌలిక స్వరూపానికి వ్యతిరేకంగా పాలన సాగుతున్నదని పలమనేరు తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తూ.గో జిల్లా అనపర్తిలో సభ నిర్వహించకుండా పోలీసులే అడ్డుకోవడన్ని నిరసిస్తూ పట్టణంలోని పద్మశ్రీ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం నల్ల బ్యాడ్జీలు ధరించి కళ్ళకి గంతలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పట్టణ నాయకులు ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు మరియు గ్యాస్ నాగరాజులు ప్రసంగించారు. అనపర్తిలో ఉదయం సభకు అనుమతినిచ్చి సాయంత్రం అనుమతి లేదంటూ సభను అడ్డుకోవడం దారుణమన్నారు. పోలీసులే టీడీపీ కార్యకర్తల్ని రెచ్చగొట్టి వారిపై లాఠీ చార్జీ చేసి



శాంతి భద్రతలకు విఘాతం కల్పించారన్నారు. నాయకులు సుబ్రహ్మణ్యం గౌడ్, ఖాజా పీర్ తదితరులు పాల్గొన్నారు.
**గంగాధరనెల్లూరు:** తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో మాజీ సీఎం చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకోవడం పట్ల నిరసనగా టీడీపీ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. శనివారం అంబేద్కర్ విగ్రహం ఎదుట మండల పార్టీ అధ్యక్షులు స్వామి దాస్ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పలువురు టీడీపీ నేతలతో కలిసి నియోజకవర్గ టిడిపి కో ఆర్డినేటర్ భీమనేని చిట్టి బాబునాయుడు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అనపర్తి పర్యటనకు అనుమతులు ఇచ్చి సాయంత్రం సభ జరిగే సమయానికి దాన్ని రద్దుచేసి పోలీసులు చేత సభ జరగకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. నేతలు జయశంకర్ నాయుడు, రాజేంద్రన్, వెంకటేష్, దేవసుందరం , శ్రీధర్ యాదవ్, మునిరాజుల యాదవ్, దీపక్ నాయుడు, జ్యోతిరెడ్డి, జీవరత్నం, శాంత కుమార్, జ్యోతి యాదవ్, కోదండ రెడ్డి, ప్రభాకర్ నాయుడు, మోహన్ నాయుడు, ప్రకాష్ నాయుడు, విజయకుమార్ రెడ్డి, గిరిబాబురెడ్డి, కొత్త పల్లి శంకర్, సంపత్, పాల్గొన్నారు.



## భక్తులకు అన్నదానం



**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కాలినడకన మూలకోనకు వెళ్లే భక్తులకు పుత్తూరు మండలం రామకృష్ణాపురం పంచాయతీ కళింకుప్పం వద్ద జగ్గయ్య ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య, నాయకులు గిరి, నాధముని, సాయి, విజయభాస్కర్‌రెడ్డి, అమతవల్లి, క్రిష్ణమూర్తి, మనోహర్, మాజీ ఎంపీటీసీ కోట గజపతి, చిన్నబ్బ, నగరి నియోజకవర్గ బీసీసెల్ ప్రధాన కార్యదర్శి కరుణాయాదవ్, మునివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీతో విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు




**ప్రజాశక్తి-క్యాంపస్:** ఎన్‌సీసీ.. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ యోగేష్ దుంగరకోటి పేర్కొన్నారు. వార్షిక గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా, ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవ శిబిరాన్ని నిర్వహిస్తారు. దేశంలోని పదిహేడు డైరెక్టరేట్‌లు ఒక్కొకటి దాదాపు 112 మంది క్యాడెట్‌లను రేపబ్లిక్ డే వేడుకలకు పంపుతారు. ఈక్వెస్ట్రియన్ ఈవెంట్‌లలో పోటీపడే 10 మంది ఆర్ వీ క్యాడెట్‌లు కూడా పాల్గొంటారు. 2023 రిపబ్లిక్ డే క్యాంప్‌లో ప్రతిభ సాధించిన క్యాడెట్‌లను ప్రోత్సహించడానికి ఎన్‌సీసీ నగర్‌లో సన్మాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. 2023 రిపబ్లిక్ డే క్యాంప్‌లో తిరుపతిలోని ఎన్‌సీసీ గ్రూప్‌నకు చెందిన 9 మంది క్యాడెట్లు తెలుగు రాష్ట్రాల డైరెక్టరేట్ ఏపీ, టీఎస్‌కి ప్రాతినిధ్యం వహించారు. రిపబ్లిక్ డే ఫరేడ్‌లో పాల్గొనడమే కాకుండా 17 స్క్వాడ్రన్‌లు, 5 రెజిమెంట్‌లతో పోటీపడిన 2 (ఏ) ఆర్, వి రిజిమెంట్ ఎన్‌సీసీ తిరుపతికి చెందిన నలుగురు క్యాడెట్‌లు ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో ఒక బంగారు, ఒక రజత, 3 కాంస్య పతకాలను గెలుచుకున్నారు. ఇందులో భాగంగా ఈ క్యాడెట్‌ల వెనుక ఉన్న వారిని ప్రోత్సహించిన, వారి తల్లిదండ్రులను కూడా ఆహ్వానించారు. తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ యోగేష్ దుంగరకోటి క్యాడెట్‌లను, వారి తల్లిదండ్రులను సత్కరించారు. ఇలాంటి ప్రతిభ, వారి ఎదుగుదల కోసం స్కేటింగ్‌లో చురుకుగా పాల్గొనాలని కమాండర్ క్యాడెట్‌లను మరింత ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదలను ఆదుకోవడమే ట్రస్టు లక్ష్యం



**ప్రజాశక్తి -గూడూరు :** పేదలను ఆదుకోవడానికి తానున్నానంటూ ముందుకు వచ్చి సేవ చేస్తున్న రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ సేవలు ఎంతోమందికి ఆదరణగా ఉంటోంది. ఈ క్రమంలోనే శనివారం మండల పరిధిలోని దివిపాలెం గ్రామ గిరిజన కాలనీలో నివాసం ఉంటున్న తిరుమలశెట్టి సురేష్ అనే యువకుడు విద్యుత్తు స్తంభం పైనుంచి పడిపోయి రెండేళ్లుగా ఏ పనీ చేయలేక నడవలేని స్థితిలో ఉన్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు, మతి స్థిమితం లేని చెల్లెలతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. విషయం తెలుసుకున్న రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రాజనేని శ్రీనివాసులునాయుడు శనివారం వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. వారికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరిపరిస్థితిని చూసి చలించి పోయామని.. వీరిని ఆర్థికంగానే కాకుండా వైద్యపరంగా ట్రస్ట్ తరపున ఆదుకుంటామన్నారు. పిల్లల చదువులకు సాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బాబు పాల్గొన్నారు.

## తిరుమలలో క్షేత్రపాలకుడికి వేడుకగా అభిషేకం



**ప్రజాశక్తి-తిరుమల:** తిరుమలలోని గోగర్భం సమీపంలోని రుద్రుని రూపమైన క్షేత్రపాలకుడికి శనివారం వేడుకగా అభిషేకం జరిగింది. తిరుమల క్షేత్రానికి పాలకునిగా ఉన్న రుద్రునికి మహాశివరాత్రి సందర్భంగా ఏటా అభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయం నుంచి ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు క్షేత్రపాలక శిల వద్దకు చేరుకున్నారు. పాలు, పెరుగు, చందనం, పన్నీరు, కొబ్బరినీళ్ల ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఆ తర్వాత నైవేద్యం సమర్పించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ పేష్కార్ శ్రీహరి, ఇతర సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాల దొంగల అరెస్టు



**ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:** చిత్తూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న తమిళనాడు రాష్ట్రం గుడియాతంకు చెందిన ఇద్దరు నేరస్తులు ప్రకాష్, శరవణమూర్తిలను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని విచారించారు. నేరస్తులు ఇచ్చిన సమాచారం మేరకు చిత్తూరు రిజర్వుడు ఫారెస్టులో దాచి ఉంచిన 20 మోటరు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడు రాష్ట్రం గుడియాతంకు చెందిన ప్రకాష్, శరవణమూర్తిలు చిత్తూరు నగరంలో రాత్రివేళల్లో తిరుగుతూ వీధుల్లో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడేవారని నగరంలో ద్విచక్రవాహనాల చోరీలపై ఫిర్యాదులు రావడంతో నిఘా ఉంచిన పోలీసులు శనివారం తాళంబేడు-చిత్తూరు రోడ్డులో అదుపులోకి తీసుకున్నట్లు చిత్తూరు డిఎస్‌పి శ్రీనివాసమూర్తి తెలిపారు. పట్టుబడ్డ నేరస్తులపై 20 కేసులున్నాయని చోరీ చేసిన ద్విచక్రవాహనాల విడిభాగాలను తమిళనాడు రాష్ట్రంలో విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డిఎస్‌పి తెలిపారు. ద్విచక్రవాహనాల చోరీ కేసులో నిందితులను అరెస్టు చేసి ప్రతిభ కనబరచిన పోలీసులను అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



**ప్రజాశక్తి-పుంగనూరు:** రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని లారీ ఢీకొని పలమనేరుకు చెందిన యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదం జాతీయ రహదారి గుడిసెబండ బస్‌స్టాప్ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా... పలమనేరు మండలం ఎం సి పాలెంకు చెందిన అంజాద్ భాష కుమారుడు అధిల్ (18) పలమనేరులోని చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. తన సొంత పనిపై పుంగనూరుకు వచ్చి తిరుగు ప్రయాణంలో వెళ్తుండగా పలమనేరు వైపు నుండి వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు కింద పడిపోయి, పెట్రోల్ ట్యాంకు పేలడంతో మంటలు అంటుకోవడంతో అధిల్ సజీవ దహనం అయ్యాడు. ప్రమాదం గుడిసె బండ బస్ స్టాప్ టోల్ ప్లాజా గేటు సమీపంలో జరిగింది. ఢీకొన్న లారీ ఆగకుండా వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం జరిగిన సంఘటనను కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## బావిలో పడి మహిళ మృతి



**ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి:** ధర్మపురి పంచాయతీ పరిధిలోని మేకల నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపానగల బైరెడ్డిపల్లి అప్పయ్య స్వామి భూమిలోని బావిలో గుర్తుతెలియని మహిళ శవం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని శవాన్ని వెలికితీయగా ఆమె మేకల నాగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన చిన్న రాజు భార్య కళావతి (43) గా గుర్తించారు. ఈమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఈమె రెండు రోజుల క్రితం నుండి కనబడలేదని ఆమె భర్త పోలీసులకు తెలియపరిచాడు.

## ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

**ప్రజాశక్తి-ఓజిలి:** పేకాట ఆడుతున్న ఐదుగురిని ఎస్ఈబీ పోలీసులు అరెస్టు చేసిన సంఘటన మండల పరిధిలోని ఆరిమేనుపాడు గ్రామంలో శనివారం జరిగింది. ఓజిలి ఎస్సై ఆదిలక్ష్మి కథనం మేరకు.. ఆరిమేనుపాడు గ్రామంలోని శీసాయి పెట్రోల్ బంక్ ఆఫీస్ రూమ్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారనే సమాచారంతో శనివారం తెల్లవారుజామున సిబ్బందితో కలిసి దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రూ.22 వేలు నగదుతో పాటు ఐదు ఫోన్లు, 2 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జూదం ఆడివారికి ప్రోత్సహించిన వారిపై చర్యలు తప్పవని ఎస్ఈబీ సెబ్ ఇన్‌స్పెక్టర్ కె.ఆర్ యువీఎస్ ప్రసాద్ తెలిపారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది రమణయ్య, వెంకటేశ్వర్లు, సురేష్, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సీసాలు స్వాధీనం



**ప్రజాశక్తి-తిరుమల:** తిరుమలలో స్థానికులు నివసిస్తున్న బాలాజీ నగర్ లో మద్యం కలకలం రేగింది. ఓల్డ్ బార్బర్ క్వార్టర్స్ వద్ద సుమారు 22 మద్యం బాటిల్స్ ను స్పెషల్ ఎన్-ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది స్వాధీనం చేసుకోవడంతో ఒక్కసారిగా అందరూ ఉలిక్కిపడ్డారు. కాంట్రాక్ట్ పనుల నిమిత్తం అనంతపురం జిల్లా బత్తలపల్లె గ్రామం నుంచి తిరుమలకు వచ్చిన సుమలత, నాగేంద్ర ప్రసాద్, బిన్నీ, ప్రవీణ్ కుమార్ లు అక్రమార్జనకు అలవాటు పడి అక్రమంగా కొండపై మద్యం తరలించి విక్రయిస్తున్నారంటూ విజిలెన్స్ వారు ఇచ్చిన సమాచారం మేరకు నివసిస్తున్న ప్రాంతంలో తనిఖీలు చేసి మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

## చెరువులో పడి యువకుడి మృతి

**ప్రజాశక్తి-వరదయ్యపాలెం:** మండలంలోని కురింజలం చెరువులో పడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. వివరాలిలా.. కురింజలం గ్రామానికి చెందిన ప్రకాష్ (24) అనే యువకుడు శ్రీసిటీలోని ఓ కంపెనీలో పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. చెరువులో గొర్రెలు కడగడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోవడంతో ఈత రాక నీటిలో మునిగిచనిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు.


# శివనామ స్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు



**ప్రజాశక్తి-వి.కోట:** మండలంలోని శివాలయాలు శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివనామస్మరణతో మార్మోగాయి. అంతర్రాష్ట్ర సరిహద్దు వి.కోట సమీపంలోని కర్నాటక రాష్ట్రం కమ్మసంద్రలో వెలసిన కోటిలింగాల క్షేత్రం శనివారం శివరాత్రి పండుగ సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. పాలకమండలి ఆధ్వర్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుద్దీపాలతో, పూలమాలలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ప్రతిష్టించిన 108 అడుగుల ఎత్తైన శివలింగం, 37 అడుగుల ఎత్తైన నందీశ్వరుని విగ్రహాలకు ఆలయ నిర్వాహకులు పంచామతాభిషేకాలతో విశేష పూజలు నిర్వహించారు. ఆంధ్రా, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామి వారికి పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ప్రాంగణంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. శివరాత్రిని పురస్కరించుకుని జాగరణ కోసం సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రం వి.కోటలోని కాశీ విశ్వేశ్వర ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



**కార్వేటినగరం:** మహా శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని శనివారం శైవ అలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. కార్వేటినగరం ప్రసిద్ధ స్కంధపుష్కరిణీ వద్ద వెలసిన శ్రీతంగమేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 8 గంటలకు స్వామివారి మూల విరాట్‌ను వేద మంత్రాల నడుమ పాలు, పెరుగు, చందనం, తేనే, నారికేళీ జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. స్థానికులే కాకుండా సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు టీ.నాగశయనం కుటుంబ సభ్యులు, అలాగే అంభరిషీరాజు కుటుంబ సభ్యులు, గంగారావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్న ప్రసాదాలను పంచిపెట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. శివపార్వతుల కళ్యాణం మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని తంగమేశ్వరస్వామి ఆలయంలో వేద పండితులు వేద మంత్రాల నడుమ, వైభవంగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని సుద్ధగుంట సమీపంలో వెలసిన శిష్టా సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయం, కాశీవిశ్వేశ్వర ఆలయం, డైట్లో వెలసిన శ్రీఉమామహేశ్వరస్వామి ఆలయం, పాదిరికుప్పం సమీపంలోని చెరువు కట్టపై వెలసిన్న శివాలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. సదాశివేశ్వర స్వామి ఆలయంలో రాత్రి వీధి నాటకోత్సవం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు పలువురు పాల్గొన్నారు.



**గంగాధర నెల్లూరు:** శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వింజం పంచాయతీకి చెందిన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో నిర్వాహకులు మనోహర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ రామక్క గోవింద్ సుబ్రహ్మణ్యంరెడ్డి, ప్రకాష్ ల ఆధ్వర్యంలో తెల్లవారుజామున వేద పండితుల ఆధ్వర్యంలో లింగోద్భవం, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కొట్రకోనలోని శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానం, గంగాధర నెల్లూరు గంగాధరేశ్వర స్వామి, మహాదేవ మంగళం మహదేవుడు, వెజ్జు పల్లెలో ఆవుదేవర నందీశ్వర స్వామి, వేల్కూర్‌లోని శివాలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకం, అర్చనలు నిర్వహించారు. జాగరణ చేసే భక్తులకు శనివారం రాత్రి హరికథ కోలాటాలు, ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.
**బైరెడ్డిపల్లి:** మండలంలో శనివారం శివరాత్రి సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. హరహర శంభో శంకర, శివనామాలతో ఆలయాలు మారుమోగి ఆధ్యాత్మికత ఉట్టిపడింది. మండలంలోని ఆలయాల్లో ఉదయం పంచామతాభిషేకం, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మండలంలోని పాతపేట గ్రామంలో శ్రీ భ్రమరాంబిక దేవి సమేత శ్రీ మల్లికార్జున స్వామి ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి ప్రత్యేక వాహనంలో గ్రామ పుర వీధుల్లో వివిధ సాంస్కతిక కార్యక్రమాల నడుమ ఊరేగించారు. భక్తులు ఆది దంపతులకు మంగళహారతులు పట్టారు. మండలంలోని తీర్థం సమీపంలోని శ్రీ కాళభైరవేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామికళ్యాణోత్సవం కనులపండువగా చేపట్టారు.



**బంగారుపాళ్యం:** శివనామస్మరణలతో మార్మోగిన మండలంలోని మొగిలి గ్రామంలో స్వయంభుగా వెలసియుండు శ్రీ కామాక్షి సమేత మొగిలేశ్వర స్వామి ఆలయంలో శనివారం మహాశివరాత్రి పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివనామ స్వరం మర్మోగించారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల్లోని శివ భక్తులు పాల్గొని స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. పలమనేర్ డిఎస్‌పి సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జికెసి కళ్యాణమండపం యాజమాన్యం పలువురికి అన్నదాన కార్యక్రమం చేపట్టింది. ఎమ్మెల్యే బాబు, కాణిపాక ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి కాణిపాక ఆలయం నుంచి ఉదయం మొగిలిలోని శివపార్వతులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపార ధర్మకర్త విజయ్ కుమార్, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా, ఆలయ కార్యనిర్వహణాధికారి మునిరాజులు, సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

